క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికురాలికి ఎమ్మెల్యే గిరిధర్ పరామర్శ

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు కనపర్తి విమలను ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఆర్ఎంఓ సతీష్‌లను ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగం అధికారులు విమలను కొద్దిరోజుల నుంచి విధుల నుంచి తప్పించారన్నారు. అయితే ఆ విషయం తన దృష్టికి రావడంతో వెంటనే విధుల్లో చేర్చుకోవాలని సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు. ఈ సమాచారం విమలకు చేరడం ఆలస్యమైందని పేర్కొన్నారు. విమల క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. విమల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. విమలకు ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నెహ్రూనగర్: పారిశుద్ధ్య కార్మికురాలు విమలను నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతికి విజ్ఞప్తి చేశారు.

వెంకటేశ్వర్లు కృషి మరువలేనిది



నెహ్రూనగర్: రజకుల సమస్యల పరిష్కారానికి బొంతల వెంకటేశ్వర్లు జీవితాంతం కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకుని బ్రాడీపేటలో ఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలను కలుపుకుని రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు వైకే, జీఆర్ భగత్ సింగ్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఏడుకొండలు, శేషగిరిరావు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై కేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై ఆరు కేసులు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో పలు వాటర్ ప్లాంట్‌లను మంగళవారం తనిఖీ చేశారు. ప్యాకింగ్ రూల్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాలు.. మన్యం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురానికి చెందిన దేవర సాయి(30) కోల్డ్ స్టోరేజ్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. తెల్లవారుజామున మిర్చియార్డు జైంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లారీ ఢీకొని మహిళ..

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని ఆయిల్‌ట్యాంకర్ ఢీకొనగా మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఒంగోలుకు చెందిన సి.హెచ్.రోజాకాంతం(52) నల్లపాడు గ్రామంలోని స్మార్ట్ సిటీ కాలనీలో నివసిస్తుంటారు. మంగళవారం సాయంత్రం మనవడికి అనారోగ్యంగా ఉండటంతో భర్త, కుటుంబ సభ్యులు కారులో చికిత్స నిమిత్తం గుంటూరు బయల్దేరారు. అదే విధంగా రోజాకాంతం తన కుమారుడి ద్విచక్ర వాహనంపై గుంటూరు బయల్దేరారు. నల్లపాడు సమీపంలో అతివేగంగా వెనుకగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కుమారుడు వాహనం రోడ్డుపక్కన పడింది. రోజాకాంతం లారీ టైరు కింద పడి మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారం శ్యామలాదాస్‌నగర్‌కు చెందిన జి.శ్రీనివాసరావు(43) ఈనెల 17వ తేదీ జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు పేర్కొన్న అడ్రస్సులో సంబంధిత వ్యక్తులు ఎవరూ లేరు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సంప్రదించాలని కోరారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



జోసఫ్ నగర్‌లో చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: చెరువులను మరింత ప్రయోజనంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. చుట్టుగుంట చెరువు చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు, స్థానిక పార్టీ నేతలతో కలసి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని చుట్టుగుంట చెరువును శరవేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. జోసఫ్ నగర్‌లోని చెరువును కూడా సర్వే జరిపించి సరిహద్దులు గుర్తించి అన్యాక్రాంతం కాకుండా అభివృద్ధి చేస్తామని వివరించారు. అనంతరం 25వ డివిజన్ పరిధిలోని జోసఫ్ నగర్ శివారు ప్రాంతంలోని చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఏ ప్రాంతంలో ఉన్న సహజ వనరులైనా అవి మనందరివి అన్న భావన స్థానికులందరిలో పెంపొందాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజారోగ్యంతో పాటు ప్రజలకు ఆహ్లాదం కలిగించే పార్కులు, ఉద్యానవనాలు, చెరువుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఎక్కడికక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన చెరువులు, పాతబడిపోయిన పార్కులను గుర్తించి వాటిని నందనవనాల్లా తీర్చిదిద్దేందుకు నడుం బిగించినట్లు వివరించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ తన నియోజక వర్గాన్ని ఆహ్లాదంతో కూడిన అభివృద్ధి దిశలో తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలతో సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు చంద్రగిరి కరుణకుమారి, అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, అందుగుల సంతోష్, బూసి రాజలత, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేషన్ ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్, ఏఈ నాగవేణి పాల్గొన్నారు.

రీ సర్వే త్వరగా పూర్తి చేయాలి

అదనపు కమిషనర్ రోజా



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రోజా

నెహ్రూనగర్: నగరంలో చేపట్టిన రీ సర్వే ఈ నెల 22 నాటికి 85 శాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా అన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సిటీ ప్లానర్, డెప్యూటీ కమిషనర్లతో కలసి రీ సర్వే వేగవంతం, రెవెన్యూ వసూలుపై ప్లానింగ్, అడ్మిన్, వీఆర్ఓ, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులు సమన్వయంతో సర్వే పూర్తి చేయాలని చెప్పారు. నగరంలో 2,06,650 అసెస్మెంట్లకు గాను 1,25,754 అసెస్మెంట్ల సర్వే పూర్తి చేయగా, ఇప్పటికీ 60.85 శాతం రీ సర్వే పూర్తి అయిందన్నారు. సచివాలయాల వారీగా తక్కువ శాతం ఉన్న అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శుల వారిగా సమీక్షించి, సమన్వయమే సర్వేలో కీలకమని, అడ్మిన్‌లు అసెస్మెంట్ల పూర్తి వివరాలు బుధవారం సాయంత్రానికి ప్లానింగ్ కార్యదర్శులకు ఇవ్వాలని ఆదేశించారు.

పన్ను రాయితీపై అవగాహన

అదనపు కమిషనర్ పెద్ది రోజా మాట్లాడుతూ 5 శాతం పన్ను రాయితీ వసూలుపై సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాల ప్రకారం నెలాఖరుకు రూ.50 కోట్లు వసూలు తప్పనిసరిగా జరగాలన్నారు. పన్ను రాయితీ అవకాశం ప్రారంభించిన 5వ తేదీ నుంచి ఇప్పటి వరకు రూ.16 కోట్లు వసూలు అయ్యాయని, మిగిలిన రూ.34 కోట్ల వసూలుకు తగిన విధంగా ఆర్ఓలు రానున్న 11 రోజుల్లో ప్రతి రోజు రూ.75 లక్షల చొప్పున వసూలుకు తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. గతంలో నిలిపివేసిన సూపర్ స్ట్రక్చర్ పన్నును విధించాల్సి ఉన్న భవనాలకు వెంటనే విధించాలని, చెరువు పోరంబోకులు, నగరంలోని రోడ్ల మార్జిన్లు, ప్రధాన ప్రాంతాల్లో ఆక్రమణలు, అభ్యంతర పోరంబోకు స్థలాల్లో లేని వాటికే విధించాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ 50 శాతంలోపు రీ సర్వే జరిగిన ప్లానింగ్ కార్యదర్శులను సమీక్షించి, పని తీరు మెరుగు పరుచుకోవాలని, నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్లు మూర్తి, కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

భవిష్యత్ తీర్చిదిద్దే బాధ్యత తీసుకున్నాం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న కేవీ సెబాస్టియన్, మంజు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల దశలోనే విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ పేర్కొన్నారు. నరగంపాలెంలోని మాంటిస్సోరి స్కూల్లో మంగళవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ 9వ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈసందర్భంగా సెబాస్టియన్ మాట్లాడుతూ పాఠశాలపై నమ్మకముంచిన తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పదో తరగతి పబ్లిక్ రాసిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నర్సరీ నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు పాఠశాలను, తమ సహచరులను వీడివెళ్లే క్రమంలో భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్‌తో పాటు కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు.

రంజాన్ తోఫా పంపిణీ



నెహ్రూనగర్: 29వ డివిజన్ నల్లకుంటకు చెందిన వలి ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందజేయడం అభినందనీయమని డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలోని ముస్లింలకు కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా దాతలు ముందుకు వచ్చి తోఫా అందజేయడం శుభపరిణామన్నారు.

జీజీహెచ్ స్టాఫ్ నర్సుకు సన్మానం



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి, పక్కన ఆషా సజని

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీలకు గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సు వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పారా వాలీబాల్ క్రీడలో పాల్గొని విజేతగా నిలవడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కజికిస్తాన్‌లో జూలై 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నీకి హాజరుకానున్నారు. ఈమేరకు మంగళవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ దేశ ఖ్యాతిని విజయ్‌కుమార్ ఇనుమడింప చేయాలనీ ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వాసుపత్రిలో విధి నిర్వహణలో ఎంతో చిత్తశుద్ధితో పనిచేసే విజయ్‌కుమార్ పారా వాలీబాల్ క్రీడకు భారతదేశం తరపున ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషాసజని, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యలో పరిశోధనలు అవసరం



జూపూడి రంగరాజును సత్కరిస్తున్న నాగభూషణం, సీతారామయ్య, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యలో పరిశోధనలు సాగించాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో మంగళవారం డి.ఫార్మసీ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రంగరాజు మాట్లాడుతూ డి.ఫార్మసీ విద్యార్థులు ఈ–సెట్ పరీక్ష రాసి, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ వంటి ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలని సూచించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ డి.ఫార్మసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐ, సీజీహెచ్ఎస్, రిటైల్ సేల్స్ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.రవి కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



నాగప్రసాద్‌ను సత్కరిస్తున్న రాధాకృష్ణమూర్తి, కుటుంబరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శ్రమను నమ్ముకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆదాయపు పన్నుశాఖాధికారి వి.నాగ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పాత గుంటూరు బాలాజీ నగర్‌లోని హిందూ కాలేజీ హైస్కూల్ బ్రాంచి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగ ప్రసాద్ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో జీవితంలో ఏదైనా సాధించగలరని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, బహుమతి ప్రదానోత్సవం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు, హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు, బ్రాంచ్ ఇన్‌చార్జి జి.గాయత్రి, పీఈటీ మాస్టారు సాయిబాబు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్‌ను అభినందించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



మల్లికార్జునరావుని అభినందిస్తున్న ఎస్పీ

నగరంపాలెం: వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన మల్లికార్జునరావు భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆకాంక్షించారు. ఈనెల 15న తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు చేపట్టగా, సౌత్ ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ మల్లికార్జునరావు బంగారు పతకం సాధించారు. ఈ మేరకు అతన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకోండి



నాగూర్ షరీఫ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ప్రభావతి, మినిస్టీరియల్ సిబ్బంది

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగూర్ షరీఫ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్‌ను గుంటూరు జీజీహెచ్ శుశ్రుతహాలులో ఆస్పత్రి మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. కార్యక్రమానికి మినిస్టీరియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కలిగిన సంఘంలో పదవిని అధిరోహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. శని, ఆదివారాలు ప్రభుత్వ ఉద్యోగులందరికీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విశేష సేవలందించినందుకు డాక్టర్ ప్రభావతిని అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, సెక్రటరీ ఎస్.సతీష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, నగర అధ్యక్షుడు సూరి, జీజీహెచ్ ఏడీ సి.హెచ్.నాగేశ్వరావు, ఏ ఓ పూసల శ్రీనివాసరావు, ఆర్డీ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, అసోసియేషన్ నాయకులు డి.సాంబశివరావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలి



ఆర్ అండ్ బీ అధికారులతో కలసి ప్రధాన రహదారులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి నగరం బయటకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలని కార్పొరేటర్లు మొహమూద్, యిర్రి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. మంగళవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాత గుంటూరు ప్రధాన రహదారి, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాలను ఆర్ అండ్ బీ ఎస్ఈ నిర్మలదేవి, డీఈఈ రాజేంద్రనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందివెలుగు రోడ్డు రైల్వే గేటు వరకు అసంపూర్తిగా రోడ్డు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, అదే విధంగా పొన్నూరు రోడ్డు, ఏటుకూరు రోడ్డు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని కూడా అభివృద్ధి చేయాలని కోరారు. రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శృంగారపు శ్రీనివాసరావు, మురళీ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తోట మణికంఠ, నాగేశ్వరి పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్ల పంపిణీ



సచివాలయ సిబ్బంది రంజాన్ తోఫా కిట్లు, నూతన వస్త్రాల అందిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: క్రమశిక్షణ, దాతృత్వం ధార్మిక చింతన కలయిక రంజాన్ పండుగ అని జాహీద్ అలీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకులు పఠాన్ మహమ్మద్అలీఖాన్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జాహీద్అలీ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 15వ డివిజన్‌లోని 50వ సచివాలయ సిబ్బందికి రూ.1,500 విలువ చేసే రంజాన్ తోఫా కిట్లను, నూతన వస్త్రాలను మంగళవారం ఉచితంగా అందించారు.

రేపటి నుంచి పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్‌కు శిక్షణ



ఉచిత శిక్షణ తరగతుల పోస్టర్లు విడుదల చేస్తున్న తిలక్‌బాబు, సాంబశివరావు, విజయకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: రోటరీ క్లబ్ ఆఫ్ అచీవర్స్ ఆధ్వర్యంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 20 నుంచి పాలిసెట్, ఏపీఆర్‌జేసీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతులకు సంబంధించిన ప్రచార పోస్టర్లు విడుదల చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు వివిధ సబ్జెక్టుల బోధనతో పాటు ప్రతి రోజూ 90 ప్రశ్నలతో కూడిన పరీక్షను నిర్వహించి, శిక్షణ పూర్తయ్యే లోపు మోడల్ గ్రాండ్ టెస్టులను నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 9959085200, 8885995458, 9396992111 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్‌జేసీ పరీక్ష రాసే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని, పాలిసెట్ అనంతరం ఇంగ్లిష్, బయాలజీ సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణకు అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. తొలుత పేర్లు నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరు సాంబశివరావు, కోశాధికారి కొండపనేని విజయకృష్ణ, సభ్యులు జొన్నలగడ్డ రమేష్, గుంటుపల్లి రఘునాథరావు పాల్గొన్నారు.

వ్యక్తిని బెదిరించిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై బాకీ డబ్బుల కోసం బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తపేటకు చెందిన మిట్టపల్లి శివకుమార్ సోమవారం ఎల్వీఆర్ క్లబ్‌లో ఉండగా తండెపు మురళి, చిన్నమల్లికార్జునరెడ్డి, మరో ఐదుగురు శివకుమార్‌ను బెదిరించి ఖాళీ బాండు పేపర్లపై సంతకాలు చేయించారు.

అనంతరం బలవంతంగా శివకుమార్‌ను క్లబ్‌లో నుంచి బయటకు లాక్కొని వచ్చి కారులో ఎక్కించుకుని కొత్తపేటలోని అతని నివాసానికి తీసుకెళ్లారు. శివకుమార్ భార్యను బెదిరించి ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై వేధింపుల కేసు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధించిన భర్తపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే పాములపాటి దుర్గాదేవి, ఆమె భర్త గోకుల్ ఎస్వీఎన్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి వివాహమై ఏడు సంవత్సరాలు అయింది. గోకుల్ భార్యను తరచూగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దుర్గాదేవి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఎ ఖద్ర్

పాత గుంటూరు: రంజాన్ మాసంలోని పవిత్ర రాత్రి, దివ్యఖురాన్ అవతరించిన రాత్రి షబ్ ఎ ఖద్ర్(సతామి) పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పొత్తూరి వారి తోట, ఆనందపేట, సుద్దపల్లిడొంక, సంగడిగుంట, మంగళదాస్‌నగర్, ఆలీనగర్, బ్రాడీపేట, పట్టాభిపురం, తదితర మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దివ్య ఖురాన్ పఠించారు. రాత్రంతా మసీదులలో ప్రార్థనలు చేస్తూ జాగరణ చేశారు. ముస్లిం మహిళలు ఇళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు.